నేడు కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆగస్టు 29న గురువారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని, నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యకమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

రూ.కోటి 46 లక్షలతో పిహెచ్‌సి ప్రారంభం

- మారుతున్న జీవనశైలికి అనుగుణంగా మెరుగైన వైద్యసదుపాయాల ఏర్పాటు: ఎంపి
- గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్
- పిహెచ్‌సి నిర్మాణంతో అభివృద్ధికి తొలి అడుగు : ఎమ్మెల్యే

నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్

మారుతున్న జీవనశైలిని బట్టి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అవసరమని, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు పేర్కొన్నారు. బుధవారం యాదమరి మండలంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళి మోహన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని, మెరుగైన వైద్యసేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. గతంలో పట్టణ ప్రాంతాలలో మాత్రమే మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉండేవారని, ప్రస్తుతం మారుతున్న జీవన శైలితో దేశవ్యాప్తంగా పట్టణాలు, నగరాలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం మధుమేహానికి, కంటి సమస్యకు గురౌతున్నారని అన్నారు. మధుమేహం ప్రాణాంతక వ్యాధి కాకపోయినా నిర్లక్ష్యం చేయరాదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా చికిత్స పొందాలన్నారు. కంటి శుక్లాలు, ఇతర సమస్యలకు వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం తద్వారా దేశం బాగుంటుందన్నారు. యాదమరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పిహెచ్‌సిలో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రజలు వినియోగించుకోవాలని, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ప్రధాన ఆసుపత్రికి రావాలసిన అవసరం లేకుండా వైద్య సదుపాయాలు పొందవచ్చునన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో యాదమరి మండలంలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలో రూ. కోటి 46 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించు కోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, అధిక శాతం బిపి, షుగర్‌తో బాధపడుతున్నారని, ఆశాలు, ఏఎన్ఎంల వద్ద వీటికి మందులను అందుబాటులో ఉంచడం జరిగిందని, అవసరమైన వారు తీసుకుని వాడాలన్నారు. గ్రోత్ హెల్త్ యూనిట్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.4 కోట్లు మంజూరు చేసిందని, వీటితో ఎంఆర్ఐ, సిటి స్కాన్ లు అందుబాటులోకి రావడం జరుగుతుందని, వీటిని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, నియోజకవర్గంలో యాదమరి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ప్రారంభించుకుని అభివృద్ధికి తొలి అడుగు వేశామన్నారు. త్వరలో రోడ్ల నిర్మాణాల మంజూరుకు కృషిచేసి పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, వైద్య రంగం అభివృద్ధికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌లతో కలసి అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. నియోజకవర్గంలో అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య బృందం మెడికల్ క్యాంప్ లు

ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారని, వైద్య బృందం లోని వైద్యులు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రభావతి దేవి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, అదనపు డిఎం అండ్ హెచ్ఓ వెంకటప్రసాద్, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, తహశీల్దార్ పార్థసారధి, సంబంధిత అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'డ్వామా'లో హై 'డ్రామా'..

- ఉపాధి హామీ ఏపీవో చిరునామా ఎక్కడ?
- ఉద్యోగం నింద్రలో.. విధులు తిరుపతిలో..
- తిరుపతి డ్వామా పీడీ సిసిగా చలామణి
- జీతాలు చెల్లించిన చిత్తూరు అధికారులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోగా పనిచేస్తున్న చంద్రశేఖర్ రాజు నీ చిరునామా ఎక్కడ? అంటూ ఉపాధి కూలీలు వెతుకుతున్నారు. రెండేళ్ళ క్రితం జిల్లాల విభజన అనంతరం చంద్రశేఖర్ రాజును చిత్తూరు జిల్లా నింద్ర మండలం ఏపీవోగా అప్పటి జిల్లా కలెక్టర్ బదిలీ చేశారు. కానీ ఏపీవో చంద్రశేఖర్ రాజు వైసిపి ప్రభుత్వంలోని ఓ మంత్రి అండదండలతో నింద్ర నుండి డిప్యూటేషన్ పై తిరుపతి సిఎల్ఆర్సి కోర్స్ డైరెక్టర్ గా తిరుపతి జిల్లాకు కొంత కాలం పాటు విధులు నిర్వహించేలా సి ఆర్ డి ఆదేశాలు వచ్చాయి. అయితే తిరుపతి డ్వామా కార్యాలయంలో కోర్స్ డైరెక్టర్ విధులు నిర్వహించకుండా అనధికారికంగా తిరుపతి డ్వామా పథక సంచాలకులకు సిసిగా వ్యవహరిస్తున్నాడు. నింద్ర మండలానికి ఏపీవో లేకపోవడంతో విజయపురం మండలం ఏపీవో భవితకు ఇన్‌ఛార్జి బాధ్యతలను చిత్తూరు పిడి అప్పజెప్పారు. అయితే కోర్స్ డైరెక్టర్ గా డిప్యుటేషన్ కాలం పూర్తయినప్పటికీ, గత రెండేళ్లుగా అనధికారికంగా తిరుపతి డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీఓ చంద్రశేఖర్ రాజుకు తిరుపతి డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ సిఫార్సు మేరకు.. గత నింద్ర ఎంపీడీవో డ్యూటీ సర్టిఫికెట్ ఇస్తే..... చిత్తూరు డ్వామా అధికారులు జీతాలు మంజూరు చేసేవారు. ఏపీవో చంద్రశేఖర్ రాజు తిరుపతి డ్వామా పిడి కుటుంబ సభ్యులకు దగ్గర బంధువు కావడం, వైసిపి ప్రభుత్వం లోని మంత్రి ఆశీస్సులతో ఈ వ్యవహారం రెండేళ్లుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా జిల్లా కలెక్టర్లు ఎందుకు పట్టించుకోలేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎపిఒ చంద్రశేఖర్‌రాజు ఉపాధి సిబ్బందిని బెదిరించి ఇబ్బందులు పెట్టేవారన్న విమర్శలు లెక్కలేనన్ని ఉన్నాయి.

ఉపాధి హామీలోని కొంతమంది అధికారుల విశ్వసనీయ సమాచారం మేరకు... చిత్తూరు జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నాలుగు అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పోస్టుల కొరత ఉంది. ఐనా తిరుపతి జిల్లా పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్ ఏపీవో చంద్రశేఖర రాజు సేవలు అవసరమని తిరుపతి జిల్లాకు బదిలీ చేయాలని చిత్తూరు డ్వామా పథక సంచాలకులకు లేఖను పంపారట. దీంతో చిత్తూరు డ్వామా అధికారులు ఆ ఏపీఓను తిరుపతి జిల్లాకు బదిలీ చేయడం కుదరదని జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇచ్చారట.. ఏపీవో చంద్రశేఖర్ రాజును తిరిగి చిత్తూరు జిల్లాలో ఏపీవో విధులకు హాజరు కావాలని చిత్తూరు డ్వామా అధికారులు ఆదేశించినప్పటికీ తిరుపతిలోని పిడిసిసిగా చలామణి అవుతూ క్షేత్రస్థాయిలో పథక సంచాలకులతో పాటు ఉపాధి హామీ పనుల తనిఖీ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గత రెండు నెలలుగా చిత్తూరు డ్వామా అధికారులు ఏపీవో చంద్రశేఖర్ రాజు నింద్రలో విధులు నిర్వహించడం లేదని జీతభత్యాలు కూడా నిలుపుదల చేశారు. అయినా ఆ ఏపిఒ తిరుపతి జిల్లాలో ఉపాధి సిబ్బంది నుండి డబ్బుల కలెక్షన్ చేయడం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల పాటు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్న ఏపీవో చంద్రశేఖర్ రాజుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఎలా జీతాలు చెల్లిస్తారన్నది ప్రధానమైన ప్రశ్న.....? రెండేళ్ల గా ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్రస్థాయి . సిఆర్డీ అధికారులు, జిల్లాస్థాయిలోని కలెక్టర్లు ఎందుకు పట్టించుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఏపీవో చంద్రశేఖర్ రాజు, డ్యూటీ సర్టిఫికేట్ ఇచ్చిన అప్పటి ఎంపీడీవో పై చర్యలు తీసుకుని, ఉపాధి హామీ విధుల నుండి చెల్లించిన జీతభత్యాలను సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ 'డ్యూటీ డ్రామా' వ్యవహారంలో పాల్గొన్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏపీవోపై చర్యలు తీసుకుంటాం
పీడీ రాజశేఖర్, చిత్తూరు జిల్లా

ఏపీవో చంద్రశేఖర్ రాజు వ్యవహారంపై చిత్తూరు డ్వామా పిడి రాజశేఖర్‌ను వివరణ కోరగా చిత్తూరు జిల్లాలో ఏపీవోగా విధులు నిర్వర్తించకుండా..... తిరుపతిలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నది వాస్తవం. ఏపీవో చంద్రశేఖర్ రాజు పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

తెలుగుభాషా పరిరక్షణ మన అందరి బాధ్యత

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తులసీనాథం నాయుడు

ప్రజాశక్తి- గంగవరం: ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన తెలుగు భాషను పరిరక్షించుకునే బాధ్యత తెలుగు వారిపై ఉందని, ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలుగు సాహిత్య సంస్కృతి సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు అన్నారు. బుధవారం గంగవరం సాయి గార్డెన్‌లో ఉన్న కళామందిరంలో ముందస్తుగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను తెలుగులోనే ప్రచురించాలన్నారు. తెలుగు భాషలోని మాధుర్యాన్ని గ్రహిస్తే దాని గొప్పతనం అర్థమవుతుందని పలమనేరు మండల విద్యాశాఖ అధికారి బాలసుబ్రమణ్యం అన్నారు. అనంతరం భాషాసేవ చేస్తున్న కొంతమందికి ప్రత్యేక పరిష్కారాలు అందించడంతోపాటు, జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, తెలుగు పద్యాలు, పోటీల్లో ప్రతిభ కనబరిచిన 50మంది విద్యార్థులకు జ్ఞాపికలను, ప్రశంసపత్రాలను, పుస్తక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, మాధవరెడ్డి, ఆనందబాబు, వెంకటేశు, శ్రీపురం శీతారామయ్య, చంద్రశేఖరయ్య, చైతన్య వేయాతి, తిమ్మప్ప నాయక్ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాల్లో తనిఖీలు

ప్రథమి చికిత్స కేంద్రాలను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాలను ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు సిబ్బంది బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వారికి పలు సూచనలను అందజేశారు. సోమలలో ఆర్ఎంపి, పీఎంపీ, ప్రైవేటు ల్యాబ్‌లను తనిఖీ చేసి ప్రథమ చికిత్స కేంద్రాలకు వచ్చే రోగులకు సెలైన్ పెట్టరాదని, యాంటీబయాటిక్స్ మాత్రలు మందులు ఇవ్వరాదని ముఖ్యంగా రోగులను అడ్మిట్ చేసుకొని ట్రీట్మెంట్ ఇవ్వరాదని కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని సూచించారు. వైద్యసేవలు అందజేయడానికి అనుమతులు కోరుతూ రిజిస్ట్రేషన్ కోసం జిల్లా వైద్యాధికారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే కందూరులో ఏడు ప్రథమ చికిత్స కేంద్రాలు ఉండగా బుధవారం మూడు ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేయడం చేసి జ్వరం ఇతర వ్యాధులతో ప్రథమ చికిత్స కేంద్రాలకు వచ్చే వారి పేరు ఫోన్ నెంబరు తెలుసుకొని ప్రథమ చికిత్స చేసి అనంతరం ప్రతిరోజు సాయంత్రం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వివరాలు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సోమల వైద్యాధికారి జయసింహ, కందూరు వైద్యాధికారిని విజయలక్ష్మి, సిహెచ్‌ఓ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా 'వాటర్ ట్యాంక్'

ప్రజాశక్తి- పలమనేరు: మండలంలోని మొసలి మడుగు గ్రామంలో తాగునీటి కోసం 2004లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో సత్యసాయి ట్రస్టు ద్వారా నిర్మించిన తాగునీటి ట్యాంకు నాసిరకంగా నిర్మించడంతో ట్యాంకు కిందభాగంలో పెచ్చులు పడుతున్నాయి. ట్యాంకు ఎప్పుడు కూలిపోతుందో అన్న భయంతో ట్యాంకును శుభ్రపరచడానికి కూడా స్థానికులు భయపడుతున్నారు. ఎప్పుడు ట్యాంకు కూలి తమ ఇళ్లపకై పడుతుందోనని చుట్టుపక్కల వారు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ట్యాంకు మరమ్మతులకు గురికావడంతో ప్రస్తుతం గ్రామానికి తాగునీరు లేక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా, వార్తాపత్రికలలో వార్తలు వచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెనుప్రమాదం జరుగక ముందే అధికారులు స్పందించి ట్యాంకుకు మరమ్మతులు చేయించడంతోపాటు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ట్యాంకు సమస్య తీరేవరకూ ట్యాంకుల ద్వారా అయినా తాగునీటిని అందించాలని వేడుకుంటున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న మొసలిమడుగు వాటర్ ట్యాంకు

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరణ

జాయింట్ కలెక్టర్‌గా విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లా సచివాలయంకు చేరుకున్న నూతన జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి డిఆర్ఓ బి.పుల్లయ్య, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం జేసీ ఛాంబర్‌లో కాణిపాకం దేవస్థానం వేద పండితుల ఆశీర్వాదంతో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా డిఆర్ఓ కలెక్టరేట్ ఈఓ, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు సిబ్బంది, ఎల్‌డిఎం హరీష్, మెప్మా పిడి రాధమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి జెసికి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పనిచేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిధులు : ఎంపి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎస్‌సి, ఎస్‌టి వర్గాల ఆర్థిక అభివృద్ధికి కేంద్ర ఎస్‌సి ఎస్‌టి సంక్షేమశాఖ ద్వారా నిధులు తీసుకురావడం జరుగుతుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళీమోహన్, డిఆర్ఓ బి.పుల్లయ్య, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మిలతో కలిసి జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ ఛైర్మన్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఔట్ సోర్స్ ఉద్యోగాలలో వివిధ క్యాడర్స్‌లో రిజర్వేషన్లు కల్పించడం లేదని ఎస్సీ ఎస్టీ పార్లమెంటు సభ్యులు పార్లమెంటులో చర్చించిన సందర్భంగా 2023వ సంవత్సరంలో పార్లమెంటు సమావేశంలో ఎస్సీ,ఎస్టీ పార్లమెంటు సభ్యులు ఔట్ సోర్సింగ్‌లో రిజర్వేషన్ కల్పించాలన్న అంశాన్ని లేవనెత్తడంతో సర్కులర్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వశాఖలలో జిల్లా, మండలస్థాయిలో ఔట్‌సోర్స్ ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బిందు తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు అందజేయడం జరుగుతుందని, జిల్లాకు 21 వేల హెక్టార్లలో బిందు తుంపర్ల సేద్యం సాగు చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ రైతులకు బిందు తుంపర్ల సేద్య పరికరాలను 90 శాతం రాయితీతో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 10 వేల హెక్టార్లలోకు సంబంధించి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని, అందులో ఎస్సీ ఎస్టీ రైతులు చాలా తక్కువగా నమోదు చేసుకున్నారని. బిందు తుంపర్ల సేద్యం పరికరాలకు సంబంధించి ఎస్సీ ఎస్టీ రైతులకు పూర్తి అవగాహన కలిగించాలని ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు, డివిఎంసి సభ్యులకు సూచించారు. వెబ్‌లాండ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు కొన్ని సమస్యలు ఉండడం వల్ల వాటికి సంబంధించి నేరుగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో డివిజన్ నిఘా, పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలని ఆర్‌డిఓలను కలెక్టర్ ఆదేశించారు. చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లి ఎస్టీ కాలనీకి సంబంధించి రోడ్డు సమస్యను ఆర్డీఓ, గిరిజన సంక్షేమ అధికారి, అటవీ శాఖ అధికారులు గ్రామస్థాయిలో కమిటీ సమావేశంలో తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తవణంపల్లి మండలం, దిగువ తడకర గ్రామానికి సంబంధించి ఎస్‌సి లబ్ధిదారులకు అందజేసిన ఇంటి పట్టాలకు సంబంధించి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని జెసిని ఆదేశించారు. చిత్తూరు పట్టణంలోని దర్గాసర్కిల్‌లో ఉన్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పెండింగ్ పనులను పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగిరి ఆర్డీఓలు జి.చిన్నయ్య, మనోజ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ రాజు, వెంకట్రామి రెడ్డి, గృహనిర్మాణ సంస్థ పిడి పద్మనాభం, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి, తహశీల్దార్ కళావతి, డివిఎంసి సభ్యులు రాజ్‌కుమార్, దేవరాజులు, బాబు, డేవిడ్, యల్లప్ప పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లడానికి ఉరకలేస్తున్న సిబ్బంది

- ఇప్పటికే సిబ్బంది సరిపోక ఇబ్బంది..
- ఇక్కడికి.. ఎవరు వస్తారు సార్..

ప్రజాశక్తి- విజయపురం

మండలంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది బదిలీపై వెళ్లడానికి ఉత్సాహం చూపుతున్నారు.. ఇక్కడ మేము పని చేయలేము బాబోయ్ అంటున్నారు.. ఇక్కడ నుంచి మమ్మల్ని త్వరగా పంపించు దేవుడా అంటూ వేడుకొంటున్నారు.. విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీ 12 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 180 మంది సిబ్బందికి గాను, 107 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఇందులో 39 మంది సిబ్బంది బదిలిపై వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే సిబ్బంది లేక ఎక్కడ పనులు అక్కడే తిష్ట వేసుకొని ఉన్నాయి. ఉన్న వారు కూడా వెళ్లిపోతే విజయపురం గ్రామాభివృద్ధిలో వెనుకబడిపోతాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

విజయపురం మండలం అంటే హడల్

విజయపురం మండలం మారుమూల ప్రాంతం.. ఇక్కడ పని చేయాలంటే చాలా కష్టం.. ఇక్కడ అన్నం దొరకదు.. అత్యవసరానికి బస్సు సౌకర్యం లేదు.. రాజకీయ నాయకులు ఒత్తిడి ఎక్కువుగా ఉంటుందని ఉద్యోగులు భయపడుతుంటారు. దీంతో ఇక్కడ పనిచేయడానికి ఎవ్వరు ముందుకు రావడం లేదు. దీంతో ఉన్న సిబ్బంది వెళ్లిపోతే గ్రామంలో అభివృద్ధిలో ముందుకు వెళ్లదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పై అధికారుల గమనించి ఇక్కడ సిబ్బంది కొరత లేకుండా అక్కడ నుంచి వచ్చే సిబ్బంది రిపోర్ట్ చేసుకున్న తర్వాతే ఇక్కడ ఉన్న సిబ్బంది బదిలీ చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

విద్యుత్ పోరాట స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం

- విద్యుత్తు అమరవీరులకి ఘనంగా నివాళి
- సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

నివాళి అర్పిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం సిపిఎం కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.

ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ జిల్లా నాయకులు దాసరి చంద్ర మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి విద్యుత్ ఛార్జీలు భారాలు వేయడంతో 2000 సంవత్సరంలో సిపిఎం, సిపిఐ, వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్తు మహోద్యమం సాగిందని, ఆగస్టు 28వ తేదీన హైదరాబాద్ బషీరాబాద్‌లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యమకారులపై పాసవికంగా కాల్పులు జరిపి రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాల స్వాములను బలుకున్నదని గుర్తు చేశారు. ఈ ఉద్యమం ఫలితంగా కొద్ది సంవత్సరాలు పాటు ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు జోలికి వెళ్లలేదన్నారు. ఈ 24 ఏళ్ల కాలంలో కేంద్రం, రాష్ట్రంలోని వివిధ పార్టీల ప్రభుత్వాలు చాపకింద నీరులా విద్యుత్తు రంగంలో ప్రమాదకర విధానాలు అమలుచేశాయని, ఈ సంస్కరణలతో ప్రజలకు చౌకైనా నాణ్యమైన నిరంతరాయమైన విద్యుత్ అందుతుందని పాలకులు నమ్మబలికి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణ అమలు చేసిందని, భారీ స్థాయిలో వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపిందని వీటికి వ్యతిరేకంగా వామపక్షాలు పోరాటం చేసిన సందర్భంగా ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వం బాదుడే బాదుడు అని విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేసిందని, అయితే నేడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఆ సంస్కరణలు అలాగే అమలు చేయడానికి సిద్ధమైందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికారంలోకి వచ్చినప్పుడు ఒక రకంగా వ్యవహరించడం దారుణమన్నారు. కూటమి హామీ ఇచ్చిన నేటికీ అమలు కాలేదని, కనీసం సర్దుబాటు ఛార్జీలు కూడా రద్దు చేయలేదని, విద్యుత్తు స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు కాలేదని అన్నారు. పైపెచ్చు ఆదాని కంపెనీ మీటర్లు తాజాగా విద్యుత్ కార్యాలయాలకు చేరుతున్నాయన్నారు. ఇంటింటికి మీటర్లు బిగించడానికి ఆదాని సిబ్బంది సిద్ధమవుతున్నారు. ప్రజలపై మరోసారి విద్యుత్ చార్జీలు వేల కోట్ల రూపాయలు భారం పడనుందని, అందుకే సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గత విద్యుత్ పోరాట స్ఫూర్తితో విద్యుత్ చార్జీలు తగ్గించడానికి మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. ప్రజలందరూ ఈపోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు చంద్ర, రమాదేవి, సిపిఎం నాయకులు మిధుల తదితరులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ డీఎస్పీగా డేగల ప్రభాకర్

ప్రజాశక్తి- పలమనేరు: ఇటీవల రాష్ట్రంలో జరిగిన సాధారణ డీఎస్పీల బదిలీలో భాగంగా రాజమండ్రి ఎస్‌బిలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న డేగల ప్రభాకర్ పలమనేరు సబ్ డివిజన్ డీఎస్పీగా బదిలీపై వచ్చారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

యాదమరి ఎస్సైగా ఈశ్వర యాదవ్

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: యాదమరి సబ్ ఇన్స్పెక్టర్‌గా ఈశ్వర యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై మండలానికి వచ్చారు. ఎస్సై ఈశ్వర్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో ఎన్నిక పెంచుతామన్నారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి అక్రమ వాహనాలు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు. ఇసుక, మద్యం, గంజాయి వాటిపై పూర్తిస్థాయిలో అన్ని నిఘా పెట్టి, అక్రమ వ్యాపారాలు పాల్పడే వారిపై చర్యలు చేపడతామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

వైద్యాధికారులను సన్మానిస్తున్న నడింపల్లి యువరాజు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నడింపల్లి యువరాజు, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్, పుత్తూరు గౌరవాధ్యక్షులు కోనేటి రవి రాజు ఆధ్వర్యంలో తిరుపతి టాటా క్యాన్సర్ హాస్పిటల్ (స్వీకర్) వాళ్లచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా ఉచిత వైద్యం, నోటి క్యాన్సర్, గర్భ క్యాన్సర్, ఇతర క్యాన్సర్ పరీక్ష చేసి సంబంధిత మందులను అందించారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ నుండి డాక్టర్ వెంకటయ్య బాబు, పిఆర్ఓ హేమంత్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవిరాజు, పాఠశాల హెడ్మాస్టర్ గాయత్రీ దేవి, వేణుగోపాల్, వాకర్స్ అసోసియేషన్ పుతూరు అధ్యక్షులు బాబు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, ఉప కార్యదర్శి రమేష్ రాజు, హెల్త్ డిపార్ట్మెంట్ అంబరీష్ రాజు పాల్గొన్నారు.

తహశీల్దార్ ప్రసన్న కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు సునీల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ప్రసన్నకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాల్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టితో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ఎటువంటి సమస్యనైనా పరిష్కరిస్తానని తెలియజేసినట్లు వారు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.2,11,825లు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలం మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయంలో గత మూడు నెలల్లో స్వామివారికి హుండీ ద్వారా రూ.2,11,825లు ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రెడ్డప్ప, గురుకుల్, విశ్వనాథ, గురుకుల్, కుమార్, మధు, బాలాజీ, రెడ్డప్ప పాల్గొన్నారు.

వేలంలో రూ. 2లక్షల ఆదాయం

ద్విచక్ర వాహనాల వేలం వేస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాటలో ప్రభుత్వానికి రూ. 2,29,330లు ఆదాయం వచ్చినట్లు స్ఈబీ సూపరెంటెండెంట్ శ్రీధర్ రావు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవానాలు, ఆటోవేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేయడం జరుగుతుందని తెలిపారు. ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐలు రాజ్ కుమార్, భారతి, ఏఎస్ఐ మునికృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 15వ వార్డులో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నందున చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌కి స్థానిక ప్రజలు విన్నవించుకోగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బోర్లు మంజూరు చేశారు. నీటి సమస్యని పరిష్కరించాలని చిత్తూరు నగర పాలక అధికారులను ఆదేశించడంతో వారు వెంటనే బోర్లు వేయడం జరిగింది. నీటి సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే, అధికార బృందానికి 15 వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వెంకట్రామయ్య.. నీ చెరువును కాపాడుకోవయ్యా..

ప్రజాశక్తి- కుప్పం టౌన్

కుప్పం పట్టణానికే తలమానికంగా ఉన్న బైపాస్ రోడ్డు, బిసిఎన్ రిసార్ట్స్ కూడలి ఎదురుగా ఉన్న వెంకట్రామయ్య చెరువు సుమారు దశాబ్ద కాలంగా కనుమరుగయ్యిందని స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు పెద్దఎత్తున ఆరోపిస్తున్నారు. పట్టణానికే తలమానికంగా నిలిచే బైపాస్ రోడ్డు ప్రక్కన భూముల విలువ కోట్లు పలుకుతుండడంతో సుమారు దశాబ్ద కాలం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అక్రమార్జనే ధ్యేయంగా జాతీయ రహదారికి ఆనుకుని సర్వే నెంబర్ 226/1లో 2.23 ఎకరాల విస్తీర్ణం, సర్వే నెంబర్ 226/3లో 0.72 ఎకరాల విస్తీర్ణం మొత్తం 2.95 విస్తీర్ణం గల చెరువు దురాక్రమనకు గురి అయిన విషయాన్ని పలువురు సామాజిక కార్యకర్తలు గతంలో జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లారు.

ఈ విషయమై స్పందించిన అప్పటి అధికారులు, పలుమార్లు ఘటన స్థలాన్ని పరిశీలించి చెరువు ఆక్రమణకు గురి అయినట్టు గుర్తించడం జరిగిందని, అందులో ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లి రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ వెట్రిసెల్వి దురాక్రమనకు గురైన చెరువు స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఉత్తర్వులు సైతం జారీ చేసినట్టు తెలిపారు. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు, ఆక్రమణదారులకు సహకరించినట్టు పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆనాటి నుంచి నేటి వరకు ఎంత మంది అధికారులు మారినా దురాక్రమనకు గురి అయిన వెంకట్రామయ్య చెరువును మాత్రం పట్టించుకున్న నాథుడు లేదని, అధికారులు మారేకొద్ది వెంకట్రామయ్య చెరువుతోపాటు, ఆనాటి సబ్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు సైతం అంధకారానికి చేరిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనాడు గ్రామపంచాయతీగా ఉన్న కుప్పం నేడు పట్టణ స్థాయితోపాటు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మారింది. అంతట స్థలాల రేట్లు రెట్టింపు అవుతూ కోట్లకు చేరడంతో ప్రస్తుతం నిర్మాణాలకు నిషేధిత ప్రాంతమైన చెరువులో సైతం నిర్మాణాలు చేపడుతున్నారని, భవిష్యత్తులో ఇది ఎంత ప్రమాదకరమో తెలిసిన సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులను సైతం అధికారులు పట్టించుకోకపోవడంతో వెంకట్రామయ్య చెరువును కలియుగ దైవం వెంకట్రామయ్యే పరిరక్షించుకోవాలంటూ పలువురు సామాజిక కార్యకర్తలు ఎద్దేవా చేస్తున్నారు.

ఇదే పరిస్థితి కొనసాగితే ఇప్పటికే అడుగంటిన భూగర్భ జలాలు మరింత అడుగంటి భవిష్యత్తు తరాలు తాగునీటికి తీవ్రఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని, అలాగే వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పాటు అనుకోని పరిస్థితులలో అధిక వర్షపాతం నమోదు అయితే చెరువులను పూడ్చివేయడంతో సంభవించే ప్రళయాన్ని సైతం అధికారులు గుర్తించాలని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కుప్పం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మారడంతో పాటు స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో స్థానికంగా అందుబాటులో ఉన్న ఆర్‌డిఓ, కడా పిడి వంటి అధికారులు వెంటనే స్పందించి వెంకట్రామయ్య చెరువుతోపాటు పట్టణ పరిధిలో ఆక్రమణకు గురి అయిన ప్రభుత్వ స్థలాలను గుర్తించి పరిరక్షించాలని స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



గతంలో వెంకట్రామయ్య చెరువును పర్యవేక్షిస్తున్న మదనపల్లె సబ్ కలెక్టర్ వెట్రిసెల్వి

విద్యాసామగ్రి పంపిణీ

విద్యార్థులు నోటు పుస్తకాలను అందజేస్తున్న చంద్రయ్య

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కొత్త ఇల్లత్తూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్ట్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, క్రేయాన్స్ వంటి అభ్యసనా సామగ్రిని వితరణగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, ఉపాధ్యాయులు ప్రతిమ, విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గల విద్యార్థులకు పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కౌన్సిలింగ్ చేశారు. పట్టణ సీఐ జిటి నాయుడు ఆదేశాలతో జరిగిన కౌన్సిలింగ్‌లో మైనారిటీ పూర్తికాని వారు, లైసెన్స్ లేనివారు వాహనాలను నడపరాదని సూచించారు. ఈ మధ్యకాలంలో విద్యార్థులు అధిక శబ్దంతో కూడిన ద్విచక్ర వాహనాలను అత్యంత వేగంగా నడుపుతూ స్థానిక ప్రజలను, ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలంలో నాయిబ్రాహ్మణ కులస్తులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు. మన విభాగం రాష్ట్ర కన్వీనియర్ శాంతారాం మాట్లాడుతూ ఇప్పటికే దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న దేవాలయాలలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు కనీస వేతనాన్ని రూ.25వేలకు పెంచడంతోపాటు దేవాలయాల పాలకవర్గ సభ్యులలో నాయి బ్రాహ్మణ కులానికి చెందిన వారు ఒకరు ఉండేటట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గం అధ్యక్షులు ఎన్.జ్యోతిష్, కమిటీ సభ్యులు ఎంఆర్.సుబ్రహ్మణ్యం, వి.రమేష్, నాగేంద్రబాబు, వి.లోకేష్, ఎస్.రవి, బిఎస్.మురుగేష్, నాగరాజులు, గంగరాజులు, రామ్మూర్తి, విజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం వృత్తి విద్య కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తగా మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను రెండవ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. అదేవిధంగా రెండవ సంవత్సరం విద్యార్థులు తమ అనుభవాలను, విద్యాబుద్ధులు నేర్పించే గురువులను స్మరించుకుంటూ నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. వారికి కూడా స్నేహపూరిత సత్సంబంధాలు ఉండాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి, కూచిపూడి కళాకారిని కల్పనను విద్యార్థులను ఘనంగా సత్కరించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి, జ్యోతి స్వరణ్, జగదీష్‌బాబు, షహీన్‌తాజ్, అనిల్ పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి'

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపిలు, సర్పంచులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వివిధ శాఖ అధికారులతో సర్వసభ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఆర్‌డబ్ల్యూఏఈ లోకనాథ్ మాట్లాడుతూ దాసర్లపల్లిలో తాగునీటి సమస్య ఉందని వార్తా పత్రికల్లో నేడు ప్రచురణ అయ్యిందని, ఆ సమస్య ఈరోజే పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో నీటిసమస్య ఉన్న చోట సింగ్ ట్యాంకులు ఏ గ్రామంలో అవసరమో వాటిని తెలియపరచాలన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు కలిసి మండలంలోని గ్రామాల్లో 34 ట్యాంకులు మంజూరు చేయాలని ప్రతిపాదన తెలిపారు. వ్యవసాయ అధికారి గీత కుమారి మాట్లాడుతూ రైతులకు పంట నమోదుకు వీఆర్వోలు సహకరించాలన్నారు. రెవెన్యూ శాఖ సమస్యలపై ఎంపీపీ ఆరా తీయగా దేవదొడ్డి సర్పంచ్ ముంతాజ్ ఆమీర్ బాష మాట్లాడుతూ దేవదొడ్డి గ్రామ సమీపంలోని పశువుల మేత బీడు 150 ఎకరాలు ఉన్నదని అందులో 70 నుండి 80 మంది రైతులు సాగులో ఉన్నారని కలెక్టర్ పర్యటనలో తెలియపరిచారని అన్నారు. ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలియజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీపై ఆరా తీయగా గ్రామాల్లో యంత్రాలతో పనిచేసే మస్టర్ల పేర్లు రాసుకొని బిల్లులు స్వాహా చేస్తున్నారని ఎంపీపీలు, సర్పంచులు తెలియజేశారు. దీనిపై ఏపీవో హరినాథ్‌ను ఎంపీపీ విచారణ కోరగా గ్రామపంచాయతీలో యంత్రాలతో పనిచేయించారని ఆ పనులకు బిల్లు పెట్టలేదని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం జరిగిందని తెలిపారు. మండలంలో 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను విధులకు రాలేదని పార్టీలకు విరుద్ధంగా పనిచేస్తున్నారనే అపోహలతో ఏపీ హరినాథ్ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విధులకు హాజరు కావద్దని తెలియపరచినట్లు సమావేశంలో తెలియజేయగా సుమారు పది సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం సమజసం కాదని, వారు ఏ తప్పు చేశారని తొలగించారు.. వారికి నోటీసుల ద్వారా తెలియజేసి తర్వాతే ఫీల్డ్ అసిస్టెంట్ తొలగించాలని ఎంపిపి ఎంపీడీవోను ఆదేశించారు. అలాగే వెలుగు సంఘమిత్రలను మండలంలో ఏడుగురుని తొలగించినట్లు సర్పంచులు, ఎంపీటీసీలు తెలియజేశారు. దీనిపై ఏపీఎంను విచారణ కోరగా గ్రామ సభ్యుల తీర్మానంతోనే తొలగించామని ఆమె తెలియజేశారు. దీనిపై పాతపేట సర్పంచ్ మమతా రవిచంద్రన్ మాట్లాడుతూ సమాఖ్య సభ్యుల వద్ద సంతకాలు తీసుకొని వెలుగు సిబ్బంది ఇష్టానుసారంగా సంఘమిత్రన్ని తొలగించడం అన్యాయమని, సంఘమిత్ర తప్పు చేయకపోయినా విధుల నుండి తొలగించాలని గ్రామంలో బహిరంగ సభ నిర్వహించడం దారుణమన్నారు. సభ్యులను విచారించి సంఘమిత్ర తప్పు ఏదైనా ఉందంటేనే ఆమె తొలగించాలని లేకుంటే ఆమెను కొనసాగించాలని కోరారు.

'ఉపాధి' పనుల తనిఖీ

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఆర్ కుమార్

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని అబకలదొడ్డి, తుమ్మిశి గ్రామపంచాయతీల్లో జరుగుతున్న పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏపీఆర్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మట్లాడుతూ వలసల నివారణ కొరకు, భూగర్భ జలాల పెంపు ప్రధాన ఉద్దేశ్యంగా ఉపాధి హామీ పనులు చేపట్టబడుతున్నామని తెలియజేసినారు. ప్రస్తుత మండలంలో భుగర్భజలాల పెంపుకు జరిగే పనులలో సుమారు 1734 మంది పని చేస్తున్నారని, అన్ని పనులతో కలిపి 2429 మంది పని చేస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పనులతో ఎటువంటి అవకతవకలు జరుగుకూడదని, పనులు కావాల్సిన వారికి రూ.6.95 కోట్లు విలువైన పనులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫీల్డ్ స్థాయి సిబ్బంది పనులు సకాలంలో కల్పించకపోతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

పెరుమాళ్ళపల్లె జెడ్పీహెచ్ఎస్‌కు

జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు

నేడు అవార్డు అందుకోనున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి

వ్యాయామ ఉపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి

ప్రజాశక్తి-సోమల: జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డును తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల కైవసం చేసుకుంది. గురువారం క్రీడా దినోత్సవం సందర్భంగా తిరుపతిలో నిర్వహించే జిల్లా స్థాయి అవార్డు ప్రదాన ఉత్సవంలో పెరుమాళ్ళపల్లె పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.నాగమల్లేశ్వరి అవార్డు అందుకోనున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులు పలు క్రీడా పోటీలలో గోల్డ్ మెడల్ సాధించి పాఠశాలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చారు. ఇదే క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు విద్యార్థులకు పలు క్రీడా అంశాలలో నైపుణ్యాలను నేర్పించి వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి పోటీలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించారు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో పథకాలు సాధించి అటు పాఠశాలకు ఇటు తమకు క్రీడలు నేర్పించిన వ్యాయామ ఉపాధ్యాయురాలికి పేరు తీసుకొచ్చారు. గురువారం జరగనున్న జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులో తిరుపతి జిల్లా స్థాయిలో ఐదు పాఠశాలలు ఎంపిక కాగా అందులో పెరుమాళ్ళ పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపిక కావడం గమనార్హం. తమ పాఠశాల జిల్లా స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపిక కావడం అందుకు కారణమైన వ్యాయామ ఉపాధ్యాయురాలను పాఠశాల హెచ్ఎం వి.నాగరాణి, ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



గతంలో ప్రజాశక్తి, ఇతర పత్రికలలో వచ్చిన పేపర్ క్లిప్పింగ్స్

క్రైం న్యూస్

చోరీ కేసులో
ఇద్దరు మహిళలు అరెస్ట్

5 గంటలలోపు కేసు ఛేదించిన పలమనేరు పోలీసులు

రూ. 4.5 లక్షల విలువ గల ఆభరణాల రికవరీ, బాధితులకు అప్పగింత

ప్రజాశక్తి- పలమనేరు: ఫిర్యాదు అందిన కొన్ని 5 గంటల వ్యవధిలోనే దొంగలను పట్టుకోవడమే కాకుండా మొత్తం చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు అప్పగించిన పలమనేరు పోలీసులను చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్. మణికంఠ చందోలు అభినందించారు. 27వ తేదీ మంగళవారం ఉమాదేవి అనే మహిళ తిరుపతి నుండి బెంగళూరుకు బస్సులో ప్రయాణం చేస్తుండగా, బంగారుపాలెం బస్సు స్టాప్ వద్ద ఇద్దరు మహిళలు బస్సులోకి ఎక్కారు. వారు ఆమె పక్కన కూర్చొని స్నేహంగా మాటలు కలిపారు. అంతలోనే ఆమె దగ్గర ఉన్న బ్యాగ్ పక్కన పెట్టమని సూచించి, ఆమెకు తెలియకుండా బంగారు, డైమండ్ ఆభరణాలతో ఉన్న పర్సును దొంగిలించారు. అనంతరం పలమనేరు బస్టాండ్ వద్ద దిగిపోయారు. కొద్ది సేపటికి అనుమానం వచ్చి బ్యాగ్ తెరిచి చూడగా, పర్సు దొంగలించబడిందని గ్రహించిన బాధితురాలు వెంటనే మధ్యాహ్నం 2 గంటలకు పలమనేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు, పలమనేరు ఇన్స్పెక్టర్ నరసింహరాజు నేతృత్వంలో పలమనేరు పోలీసులు, చిత్తూరు క్రైమ్ పోలీసులు పలు టీంలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు ప్రారంభించి మహిళా దొంగలు చిత్తూరులో ఉన్నారన్న సమాచారం మేరకు వారిని సాయంత్రం 8 గంటల ప్రాంతంలో చిత్తూరుకు చేరుకుని వారిని అరెస్ట్ చేసి చోరీ చేసిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు ముద్దాయిలు చిత్తూరు రూరల్ మంగసముద్రం హౌసింగ్ కాలనీకి చెందిన సురేష్ భార్య టి.శ్రావణి, మంగసముద్రం లెనిన్ నగర్‌కు చెందిన సత్యం భార్య టి.లక్ష్మీగా గుర్తించారు.

అక్రమంగా పట్టుబడిన మద్యం ధ్వంసం

అక్రమ వ్యాపారాల్లో పట్టుబడితే కఠిన చర్యలు: ఎస్ఈబీ సూపరింటెండెంట్

మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీస్ అధికారులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన మద్యాన్ని జేసీబీ యంత్రంతో బుధవారం కుమారగిరి సమీపంలో ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సూపరెంటెండెంట్ శ్రీధర్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని పాలసముద్రం మండలంలో పట్టుబడిన 390 లీటర్ల నాటు సారా, ఎన్డీ పీఎల్ మద్యం 17 లీటర్లు, శ్రీరంగరాజపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 7 కేసుల్లో 130 లీటర్ల సారాను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కార్వేటినగరం పోలీస్ స్టేషన్ పరిధిలో 264 మద్యం బాటిళ్లను జేసీబీ యంత్రం ద్వారా తొక్కించి కాల్చివేశారన్నారు. అలాగే తమిళనాడు, కర్నాటక నుంచి ఆక్రమంగా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న వారిపై కూడ కేసులు నమోదు చేశామని చెప్పారు. అదే విధంగా అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందనిఎవరైనా ఇలాంటి వ్యాపారాల్లో పట్టుబడితే వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా భారీగా జరిమానాలు ఉంటుందని తెలిపారు. అక్రమ మద్యం వాపారాలు, మద్యం రవాణాలు చేస్తూ పట్టుబడిన వారికి కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మద్యం అమ్మకాలను అరికట్టేందుకు యువతరం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కోదండరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని బుక్కాపట్నం పంచాయతీ మాజీసర్పంచ్ కోదండరెడ్డి (71) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పలువురు టిడిపి, బీజేపీ నేతలు కోదండ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోదండ రెడ్డి మరణించడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన పార్టీకి ఎనలేని సేవలు చేశారని అన్నారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నేతలు కృష్ణమ నాయుడు, వెంకటేష్, దేవసుందరం, స్వామిదాస్, రఘునాథ్ నాయుడు, శిల్ప, రాంబాబు రెడ్డి, కోదండ రెడ్డి, నియాజ్ అలి, జీవరత్నం, జ్యోతి యాదవ్, నీరజాక్షులరెడ్డి, సంపత్, వినాయకం ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రూరల్ సిఐ మల్లేష్ యాదవ్

ప్రజాశక్తి- శాంతిపురం: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ అవుట్ పోస్ట్‌లో ఆయన విలేకరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రామకుప్పం మండలం చెల్లిగానిపల్లిలో మరి కొన్ని ప్రాంతాల్లో చోటు చేసుకున్న దోపిడీలను దృష్టిలో పెట్టుకుని నేరాలను అరికట్టడానికి ప్రత్యేకశ్రద్ధ పెట్టినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల్లో ఇల్లు ఉండి బయటి ప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎస్సై ఫోన్ నెంబర్‌కు తమ మొబైల్ నుండి వాట్సాప్ లొకేషన్ షేర్ చేయాలన్నారు. అలాగే వారివారి ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి స్థోమత లేని వారికి వారి కుటుంబం బయటకు వెళ్లే సందర్భంలో సమాచారం అందిస్తే పోలీసులే సీసీ కెమెరాలు వారి ఇంటి ఆవరణలో అమర్చడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు రాత్రిపూట పోలీసు పహారా పటిష్టంగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్ వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని బంగారు నగల దుకాణాలు, ఇతర వ్యాపారస్తులతో సమావేశమై ప్రతి దుకాణానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో రాళ్ళబుదుగురు ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.